సాక్షి
అనంతపురం

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.9.50

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9.50 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.2°/ 22.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

రైతులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అనంతపురంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ, అమ్మకాలు మరింత పెరగాలని సూచించారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.6.78 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. ఈ ఏడాది రూ.20 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. యూరియా, డీఏపీ, ఇతరత్రా ఎరువులకు డిమాండ్ ఉన్నందున వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా తగినంత ఎరువులు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మా రామిరెడ్డి, డైరెక్టర్లు వై.జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరామరెడ్డి, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొర్రపాడు పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు



కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బుక్కరాయసముద్రం: కొర్రపాడు పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు లభించిందని డాక్టర్ హర్ష తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం పీహెచ్‌సీని సందర్శించింది. ఇక్కడ ఉన్న అన్ని విభాగాలూ 89.19 శాతం క్వాలిటీ సాధించినందున కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారులకు, పీహెచ్‌సీ సిబ్బందికి డాక్టర్ శ్రీహర్ష, ఫ్యామిలీ డాక్టర్ వినోద్, జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ బృందం సభ్యుడు స్టీఫెన్ బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

79 సిలిండర్లు సీజ్



సీజ్ చేసిన సిలిండర్లతో అధికారులు

అనంతపురం అర్బన్: పౌర సరఫరాల అధికారులు బృందాలుగా ఏర్పడి బుధవారం నగరంలోని పలు ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ (డొమెస్టిక్)ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తుండటాన్ని గుర్తించారు. 79 సిలిండర్లను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై 6(ఏ) కేసులు నమోదు చేశారు. జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) శోభారాణి మాట్లాడుతూ గృహావసర వంట(డొమెస్టిక్)గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడం ఎల్‌పీజీ కంట్రోల్ ఆర్డర్–2000 ప్రకారం నేరమన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్లు (సీఎస్‌డీటీ) దుర్గాప్రసాద్, జ్యోతి, కంబక్క, బీఎం బాషా, రాజశేఖర్, హరిప్రియ, రాజా, లక్ష్మీదేవి, ఇంతియాజ్, రామకృష్ణారెడ్డి, అన్సార్ ఆలమ్, ప్రతిమ, ఎల్‌పీజీ సేల్స్ ఆఫీసర్లు అనంతరామరావు, రావిమోహన్‌రెడ్డి బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ చోట్ల ధాబాలు, హోటళ్లు, టీస్టాళ్లు, ప్రైవేటు హాస్టళ్లు, టీస్టాళ్లపై దాడులు నిర్వహించారన్నారు.

పాలిటెక్నిక్ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అక్టోబర్ మూడో తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరే విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు (విద్యాదీవెన, వసతి దీవెన వంటి) అర్హులుకారు. స్పాట్ అడ్మిషన్లకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని హాజరు కావాలని సూచించారు. పాలిసెట్–2023 ఉత్తీర్ణులై ర్యాంక్ సాధించిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందాలనుకునేవారు ఏ ఇతర పాలిటెక్నిక్ కళాశాలలోనూ చేరి ఉండకూడదన్నారు.

టమాట రైతులకు ఊరట

ఈ ఏడాది ఊహించని విధంగా టమాట ధరలు ఆకాశాన్నంటాయి. కిలో ఏకంగా రూ.200 మార్క్ దాటేసింది. సామాన్యులు, మధ్య తరగతి వారు కొనలేని పరిస్థితి ఎదురైంది. రెండు నెలల తర్వాత పంట ఉత్పత్తి భారీగా పెరగడంతో ధరలు రోజుల వ్యవధిలోనే దిగి వచ్చాయి. ప్రకృతి వైపరీత్యాల వేళ, గిట్టుబాటు ధరలు లేని సమయాన టమాటను రైతులు పారబోసిన సందర్భాలూ ఉన్నాయి. వీటన్నింటినీ అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టమాట ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. వీటి ద్వారా మద్దతు ధర కన్నా అదనంగా రైతుకు లబ్ధి చేకూరేలా చొరవ చూపుతోంది.



ఒంటిమిద్ది వద్ద సాగు చేసిన టమాట పంట



తిమ్మసముద్రం వద్ద సాగు చేసిన టమాట

- కళ్యాణదుర్గంలో రెండు టమాట ప్రాసెసింగ్ యూనిట్లు
- ఒక్కో యూనిట్‌కు రూ.5.50 కోట్ల కేటాయింపు
- దళారుల ప్రమేయం లేకుండా రైతుకు అదనపు లబ్ధి

కళ్యాణదుర్గం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 16 వేల హెక్టార్లలో టమాట పంట సాగవుతోంది. 10,40,000 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో కళ్యాణదుర్గం డివిజన్‌లోనే ఏకంగా 6,528 హెక్టార్లలో 4,24,290 మెట్రిక్ టన్నుల టమాట పండుతోందని గణాంకాలు చెబుతున్నాయి. పండిన పంటను అనంతపురం, మదనపల్లి, కోలార్, రాజస్తాన్, బెంగళూరు వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. అమాంతంగా ధరలు పతనమయినపుడు రైతులు భారీగా నష్టపోతున్నారు.

కళ్యాణదుర్గానికి రెండు టమాట ప్రాసెసింగ్ యూనిట్లు

కళ్యాణదుర్గం డివిజన్లో టమాట సాగును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రైమరీ టమాట ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కళ్యాణదుర్గం మండలం వెంకటంపల్లి, కుందుర్పి మండలం బండమీదపల్లిలో ఈ యూనిట్లను నెలకొల్పేందుకు నిధులు విడుదల చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.5.50 కోట్లు కేటాయిస్తూ సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రాసెసింగ్ యూనిట్లలో టమాట సాస్, ఊరగాయ తదితర ఉత్పత్తులు తయారు చేస్తారు. ఇందుకు అవసరమైన టమాటాలను గ్రేడింగ్ చేయడం, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయడం వల్ల ఏడాది పొడవునా రైతుకు మద్దతు ధర కంటే అదనపు ధరకే అమ్ముకునే అవకాశం ఏర్పడుతుంది.

రవాణా, కమీషన్ వ్యయం మిగులు

వాస్తవానికి రైతులు తమకు వచ్చే ఆదాయంలో 10 నుంచి 20 శాతం వరకు పంటను మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే రవాణా, కమీషన్ ఖర్చుల రూపంలోనే కోల్పోతుంటారు. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతులు ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

టమాట రైతులకు చాలా మేలు



నాకున్న పొలంలో ఆరున్నర ఎకరాల్లో టమాట సాగు చేశాను. కోతలు పూర్తవడంతో రెండున్నర ఎకరాల పంట తొలగించాను. ప్రస్తుతం నాలుగెకరాల్లో పంట పూత, పిందె దశలో ఉంది. మా ప్రాంతంలో టమాట ప్రాసెసింగ్ ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించడం శుభపరిణామం.

– హనుమంతరాయుడు, రైతు, కదిరిదేవరపల్లి, కంబదూరు మండలం

రవాణా భారం తగ్గుతుంది



ఆరు ఎకరాల్లో టమాట సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రవాణా భారం తగ్గుతుంది. కమీషన్ ఇవ్వాల్సిన పనీ లేదు. ధరలు లేనప్పుడు ప్రాసెసింగ్ యూనిట్‌కు పంటను తరలించి సొమ్ము చేసుకోవచ్చు. టమాట రైతులకు ఇక బెంగ ఉండదు.

– వై.రవికుమార్, రైతు, ముప్పులకుంట, బ్రహ్మసముద్రం మండలం

రైతులకు వరం



కళ్యాణదుర్గం ప్రాంతంలో రెండు టమాట ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడం రైతులకు గొప్ప వరం. కళ్యాణదుర్గంలో యూనిట్లకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. ఒక్కో యూనిట్‌కు రూ.5.50 కోట్లు కేటాయించారు. ఈ ప్రాంతంలో అధిక మంది రైతులు టమాట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

– ఉషశ్రీచరణ్, మంత్రి

మీ సేవ కేంద్రాల్లో అక్రమాలు

- విజిలెన్స్ సోదాలతో వెలుగులోకి



మీ సేవ కేంద్రంలోని కంప్యూటర్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని రెండు మీ సేవ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా సాగిన సోదాల్లో రెండు చోట్లా అక్రమాలు బయటపడ్డాయి. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు సీఐలు సాయిప్రసాద్, రామారావు నేతృత్వంలో బుధవారం చైత్ర 'మీ సేవ' కేంద్రం, శ్రీ బసవ 'మీ సేవ' కేంద్రంలో సోదాలు చేశారు. నకిలీపత్రాల జారీకి అవసరమైన సీళ్లు, ఖాళీ ఒరిజినల్ రైస్ కార్డులు, కలరు నకలు కాపీలు, సంతకం చేసిన ఖాళీ నాన్– జ్యుడీషియల్ బాండ్ పేపర్లు ఉండటం, ఇతరులకు చెందిన ఆధార్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాలు లభించాయి. ఒక్కరికి కేటాయించిన మీ సేవ కేంద్రాన్ని మరొకరు నడపడం, ఇతరుల సీళ్లు, పత్రాలు కలిగి ఉండటం, రిజిస్టర్లు అప్‌డేట్ చేయకపోవడం, అర్జీదారుల పేర్లను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడం వంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. రెండు మీ సేవ కేంద్రాల నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సీళ్లు, ఇతర పత్రాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అనంతరం చైత్ర మీ సేవ కేంద్రంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించారు. తనిఖీల్లో డీఈఈ యోగేష్‌బాబు, ఏఓ వాసు ప్రకాష్, ఏఈఈలు రవీంద్ర, కుళ్లాయిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

- ఇదిలా ఉండగా తమ కేంద్రంలో తనిఖీలు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఓ టీడీపీ నేత విజిలెన్స్ అధికారులపై చిందులేసినట్లు తెలిసింది. 'మీకు ఇష్టం వచ్చినట్లు తనిఖీ చేసుకోండి.. నేను కోర్టులో తేల్చుకుంటా' అంటూ చిరుబుర్రులాడుతూ అక్కడి నుండి వెళ్లిపోయినట్లు సమాచారం.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



భూ పరిహారం సమస్యపై కలెక్టర్‌కు వివరిస్తున్న దృశ్యం

కణేకల్లు: ప్రజలు వివిధ సమస్యలపై అందించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. అర్జీలు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. గడువులోపు పరిష్కరించాలని సూచించారు. బుధవారం కణేకల్లులోని కేసీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం –స్పందన' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మ్యుటేషన్, రోడ్లు, విద్యుత్, ఇంటి పట్టాలు, ఇళ్లు తదితర సమస్యలపై ప్రజల నుంచి 91 అర్జీలు స్వీకరించారు. టీడీపీ హయాంలో హంద్రీ–నీవా కాలువ కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, కణేకల్లు మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నాగేపల్లి – తుంబిగనూరు మార్గ మధ్యంలో వంకలో పూడికతీత, గరుడచేడు–మీన్లహళ్లి మధ్య బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ గ్రామాల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉందని, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ఎంపీపీ సంధ్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పెనకలపాడు గ్రామానికి చెందిన శనగల వ్యాపారి రైతుల నుంచి సేకరించిన పంటలకు సంబంధించి సొమ్ము ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని సర్పంచు రామాంజనేయులు, ఉప సర్పంచు అనిల్‌కుమార్, పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, సీపీఓ ప్రశాంత్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, డీఏఓ ఉమమహేశ్వరమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజారావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వెటర్నరీ శాఖ జేడీ సుబ్రమణ్యం, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, 'స్పందన' తహసీల్దార్ వాణిశ్రీ, కణేకల్లు తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

బొమ్మనహాళ్: అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. బుధవారం బొమ్మనహాళ్ మండలంలో కలెక్టర్ పర్యటించారు. తొలుత శ్రీధరఘట్ట సచివాలయాన్ని తనిఖీ చేశారు. విద్యుత్, ఫ్యాన్లు సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు అందించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూముల రీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రాథమిక వైద్యశాలను సందర్శించారు. రోగులకందుతున్న సేవలు, మందుల నిల్వల గురించి వైద్యాధికారి గీతాభార్గవితో ఆరా తీశారు. అనంతరం మండలంలోని జగనన్న కాలనీల్లో పక్కాగృహాల పురోగతి గురించి హౌసింగ్ ఏఈ గోవర్దన్‌రెడ్డిని ఆరా తీశారు. మొత్తం పది జగనన్న లే అవుట్లలో 375 పక్కాగృహాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో 71 బీబీఎల్, 131 బీఎల్, 70 ఆర్‌ఎల్ దశలో ఉన్నాయని, నాలుగు గృహాలు పూర్తయ్యాయని ఏఈ కలెక్టర్‌కు వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో ఈ క్రాప్ నమోదు గురించి ఏఓ సాయికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపైనా సమీక్షించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, ఎస్ఐ శివ, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, వీఆర్‌ఓ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి శివన్న పాల్గొన్నారు.

కేటుగాడు దొరికాడు!

- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు బురిడీ
- రూ.లక్షలు దండుకుని ఉద్యోగం చూపని వైనం
- 4 రోజుల క్రితం కుప్పం స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- నిందితుడు రాయచోటి శశిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఉద్యోగాల పేరుతో టోకరా వేసిన రాయచోటి శశి

అనంతపురం క్రైం: ఉద్యోగాలిప్పిస్తామని రూ.లక్షలు దండుకుని ముఖం చాటేసిన మోసగాడు రాయచోటి శశిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడు బీటెక్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలిప్పిసామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 150 మందిని మోసగించాడు. జిల్లాల వారీగా ఏజెంట్లను నియమించి వారి ద్వారా నిరుద్యోగుల నుంచి డబ్బు దండుకున్నాడు. నాలుగు రోజుల క్రితం పలువురు బాధితులు కుప్పం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు బుధవారం ఉదయం రాయచోటిలోని తన స్వగృహంలో ఉన్న నిందితుడు శశిని అదుపులోకి తీసుకున్నారు. కుప్పంలోని బాధితులకు మాత్రమే డబ్బు తిరిగిస్తానని నిందితుడు చెప్పినట్లు ఏజెంట్ల ద్వారా తెలుస్తోంది. అదే జరిగితే అనంతపురం జిల్లాతో పాటు మిగిలిన ప్రాంతాల్లోని బాధితుల పరిస్థితి ఏంటనేది అగమ్యగోచరమే. ఏజెంట్లు బలమైన సామాజికవర్గానికి చెందినవారు కావడంతో డబ్బు రికవరీపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. డబ్బు కోసం నిలదీస్తే ఏజెంట్లు టీడీపీకి చెందిన నాయకుల పేర్లు చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారని వాపోతున్నారు. వీరికి అల్లరిమూకలు, రౌడీషీటర్లు అండగా ఉండటంతో ఒత్తిడి చేయలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

ఖతర్నాక్ లేడీ బెదిరింపుల పర్వం..

ఉద్యోగాలిప్పిస్తామని తమ నుంచి తీసుకున్న నగదు తిరిగివ్వాలని అడిగిన నిరుద్యోగులను 'ఖతర్నాక్ లేడీ' పోలీసుల ద్వారా బెదిరిస్తోంది. నెల క్రితం అప్పటి అనంతపురం ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు కొంతమంది నిరుద్యోగులు తమకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. బెంగళూరుకు చెందిన సదరు మహిళ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు డబ్బు తీసుకుందని ఆరోపించారు. ఏడాది దాటినా ఉద్యోగం చూపకపోవడంతో బాధితులు ఆ మహిళను నిలదీసి డబ్బు కోసం ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు మహిళ వైఎస్సార్ జిల్లా పోలీసుల ద్వారా బాధితులను బెదిరింపులకు గురి చేస్తోంది. మహిళకు ఎందుకు ఫోన్ చేస్తున్నారంటూ పోలీసులు ప్రశ్నిస్తుండటంతో.. బాధితులు నేరుగా పోలీసుల వద్దకు వెళ్లి జరిగిన విషయం తెలిపారు. అయితే న్యాయస్థానంలో కేసు వేసుకోండని పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని బాధితులు తెలిపారు.

సిగ్గు లేకుండా నిరసనలా?

- బాబు–లోకేశ్ అవినీతిని ఇంటింటికీ తెలియజేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపు



తాడిపత్రి: టీడీపీ అధినేత చంద్రబాబు– ఆయన తనయుడు లోకేశ్‌ల అవినీతి గురించి ఇంటింటికీ తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం తాడిపత్రిలో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆధారాలతో సహా చంద్రబాబు అడ్డంగా దొరికినా, అధికారం అడ్డుపెట్టుకుని లోకేశ్ అంతులేని అవినీతికి పాల్పడినా టీడీపీ నాయకులు వారి కోసం సిగ్గులేకుండా ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. నారా కుటుంబం ఇష్టారాజ్యంగా ప్రజాధనం దోపిడీ చేసిందని టీడీపీ కార్యకర్తలు బలంగా నమ్ముతున్నారని అన్నారు. అందుకే నాయకులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు పేలవంగా ఉంటున్నాయని విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్, రిమాండ్ పట్ల ప్రజలు ఎవరూ సానుభూతి చూపడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి పెన్నా నదుల అనుసంధానం, ఇన్నర్ రింగ్ రోడ్, ఏపీ ఫైబర్‌నెట్ కుంభకోణాలు, తాత్కాలిక రాజధాని నిర్మాణ పనుల్లో అవినీతి, కృష్ణా పుష్కరాల్లో రూ.1,472 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం, రాజధాని భూముల్లో సింగపూర్ సంస్థలకు 1,691 ఎకరాల ధారాదత్తంలో చోటు చేసుకున్న అవినీతిపై సీబీఐ దర్యాప్తునకు చంద్రబాబు సిద్ధమా అని పైలా సవాల్ విసిరారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో చంద్రబాబు డైరెక్షన్‌లో లోకేష్ యాక్షన్ చేశారన్నారు. చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్, లోకేష్ సన్నిహితుడు కిలారి రాజేష్ ఎందుకు పోలీసుల కన్నుకప్పి పారిపోయారని ప్రశ్నించారు. బాబు అరెస్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు గానీ, ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధమూ లేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. కక్షసాధింపు అసలే లేదని, సాక్ష్యాధారాలు పక్కాగా ఉన్నందునే చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లారన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

ఉరవకొండ: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉరవకొండ అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గమనించి త్వరగా వేలం వేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో క్రైం రేటు తగ్గిందన్నారు. చోరీలు కూడా పూర్తిగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఏరియాలోనూ సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి కేసులను కూడా పరిష్కరించేలా చూడాలన్నారు. ముఖ్యంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మట్కా, జూదం, బియ్యం అక్రమ రవాణా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే ప్రజలు తన సెల్ నంబర్ (94407 96800)కు సమాచారం తెలపాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

పోలీసులకు యోగా తప్పనిసరి

అనంతపురం క్రైం: శారీరకంగానే కాదు మానసికంగా కూడా పోలీసులు దృఢంగా ఉండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ప్రతి బుధవారం యోగా చేయాలని సూచించారు. అందులో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సిబ్బందితో యోగా చేయించారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో అనంతపురం అర్బన్‌తో పాటు రూరల్ పోలీస్ సబ్ డివిజన్ల పోలీసు సిబ్బందికి యోగా మాస్టర్లు చలపతి, దీపా పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ వేయిస్తున్న ఆసనాలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మిగతా పోలీసు సిబ్బంది అనుసరించి యోగా చేశారు. సిబ్బంది పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది ఆరోగ్యం కాపాడుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

శాంతి కమిటీలతో సమస్యల పరిష్కారం

అనంతపురం క్రైం: గ్రామాల్లో శాంతిభద్రతలతో పాటు ఇతర సమస్యలను శాంతికమిటీల ద్వారా పరిష్కరించాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కులాలు, మతాలతో సంబంధం లేకుండా గ్రామాల్లో ప్రజలందరూ అన్నదమ్ముల్లా జీవించేలా కృషి చేయాలన్నారు. పోలీసు విభాగానివే కాకుండా ఇతర విభాగాల సమస్య అయినా సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలు అందరూ ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, అభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. ఏ గ్రామంలోనైనా సమస్యలుంటే తన నంబర్ 94407 96800కు తెలియజేయాలని, వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా జేఎన్‌టీయూ బోధనేతర సంఘం ఎన్నికలు



అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన జయకృష్ణ, పుష్పలత

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బోధనేతర ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. మొత్తం 113 ఓట్లు పోలు కాగా, 111 ఓట్లు చెల్లుబాటయ్యాయి. అధ్యక్షుడిగా 46 ఓట్లతో పి.జయకృష్ణ గెలుపొందారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా వి.రాజేష్ బాబు, సెక్రెటరీగా జి.పుష్పలత, జాయింట్ సెక్రెటరీగా ఎం. ఓబులేసు, కరస్పాండెంట్‌గా ఎస్.లక్ష్మన్న, ట్రెజరర్‌గా బీఎండీ అన్సర్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఎన్నికకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఈ అరుణకాంతి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డాక్టర్ బి.దిలీప్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ చెన్నారెడ్డి వ్యవహరించారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, డాక్టర్ జి.మమత, అజిత, ఏపీ శివకుమార్, కె.కళ్యాణిరాధ పాల్గొన్నారు.

కసాపురం హుండీ చోరీ ఘటనలో అర్చకుడి అరెస్ట్



నిందితుణ్ని అరెస్టు చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: కసాపురం దేవస్థానంలో హుండీ చోరీ ఘటనలో ఆలయ కాంట్రాక్ట్ అర్చకుడు దేశికాచారిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను బుధవారం సాయంత్రం కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈ నెల 17న తెల్లవారుజామున ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణారెడ్డి హుండీలో నగదు చోరీ చేస్తూ సీసీ కెమెరాలకు పట్టుబడిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా.. అదే రోజు ఆలయ కాంట్రాక్ట్ అర్చకుడు దేశికాచారి కూడా మూడు హుండీల్లోని నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించినట్లు తేలింది. దీంతో అతనిపైనా కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం బుగ్గ సంగమేశ్వర ఆలయ ఆర్చ్ వద్ద ఉండగా ఎస్‌ఐ గోపాలుడు తన సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. మరో నిందితున్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ గోపాలుడు, పోలీసులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆముదాల

- నంది నాటకోత్సవాలకు ఆద్యుడు
- అనంత నాటకాలకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సుబ్రహ్మణ్యం



నంది పోటీలకు ఎంపికైన నాటకంలోని సన్నివేశం



జాతీయ స్థాయి నాటక పోటీల్లో అవార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

అనంతపురం కల్చరల్: గాయకుడిగా.. నాటక రచయితగా.. నటుడిగా.. దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకున్న ఆముదాల సుబ్రహ్మణ్యం అనంత కీర్తిని కళారంగంలో రెపరెపలాడిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో 23 జిల్లాల నుంచి వందల నాటకాలు పోటీ పడితే సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని రెండు నాటికలు అవార్డుకు అర్హత సాధించాయి. దశాబ్దాల నిరీక్షణలో ఒక్కసారి కూడా నంది నోచుకోని అనంతకు గతంలో ఏకంగా రెండు సార్లు బంగారు నంది అవార్డులనందించిన ఘనత ఆయనదే. మరోసారి బుడబుక్కల వారి జీవితంపై ప్రాచీన కళారూపాన్ని సృష్టించి జాతీయ స్థాయి ప్రతిభ చాటేలా అనంత యువతను తీర్చిదిద్దాడు. సుబ్రహ్మణ్యం శిక్షణలో రాటుదేలుతున్న వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు తమ సృజనను చాటుకుంటూ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు.

అనంత వాసిగానే

తిరుపతికి చెందిన లక్ష్మయ్య, కుప్పమ్మ దంపతుల కుమారుడైన ఆముదాల సుబ్రహ్మణ్యం కళల పట్ల చిరుప్రాయం నుంచే ఆసక్తి పెంచుకున్నారు. సంగీతం, నటనలో పీజీలు సంపాదించుకున్న ఆయన కళాకారునిగానే జీవిస్తూ యువతలో ప్రత్యేక స్ఫూర్తి రగిలిస్తున్నారు. ఇప్పటి వరకూ 40 నాటికలు రచిస్తే ఇందులో 30కి పైగా నాటకాలు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో బహుమతులను కైవసం చేసుకున్నాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వమందించే ప్రతిష్టాత్మక అవార్డులూ ఉన్నాయి. మూడు దశాబ్దాలుగా అనంతపురంలోనే ఉంటూ ఇక్కడే స్థిరపడిన ఆయన పలు సందేశాత్మక నాటకాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు.


నంది అవార్డుల పరంపర

ఆముదాల సుబ్రహ్మణం సృజన నుంచి జాలువారిన అనేక నాటికలు నంది పోటీల్లో వరుస బహుమతులను కైవవం చేసుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ సందేశంతో 'వృక్షో రక్షతి రక్షితః' నాటకం, 'మేరా భారత్ మహాన్' నాటిక 2016, 2017లో వరుసగా నందులను దక్కించుకున్నాయి. ప్రాచీన కళ ఆధారంగా 'బుడబుక్కల నృత్యం' పేరుతో రూపొందిన కళారూపకం ఏకంగా జాతీయ అవార్డును దక్కించుకుని అనంత ఖ్యాతిని హస్తిన వీధుల్లో రెపరెపలాడించింది. అదే వరుసలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దేవీపారిజాత అవార్డులు ఆరు సార్లు అనంతకు రావడం వెనుక సుబ్రహ్మణ్యం బృందాల కృషి మరువలేనిది. మరో 5 సార్లు రాజహంస అవార్డులు జిల్లాకు తీసుకురావడంతో ఆయన చూపిన చొరవ అనన్యం. తాజాగా ఆయన దర్శకత్వం వహించిన బాలల నాటిక 'బాధ్యత', యువనాటిక 'ఇంకెన్నాళ్లు' నంది నాటకోత్సవాల్లో తుది పోటీకు అర్హత సాధించాయి.

సినీ రంగంలోనూ ప్రవేశం

సాంఘిక, జానపద నాటకాల్లో జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా మారిన సుబ్రహ్మణ్యం సినిమా రంగంలోనూ రాణిస్తున్నారు. ఈ ఏడాది జూలైలో సాయి కుమార్ హీరోగా నటించిన 'నాలో నేను' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. మరో హీరో ఆది నటిస్తున్న చిత్రంలో డాక్టర్‌గా నటించే అవకాశం వచ్చింది. అవసరాల శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న కామెడీ చిత్రంలో హీరోకు మామ పాత్రలో నటిస్తున్నారు.

నంది పురస్కారమొస్తుందని నమ్ముతున్నా



మరోసారి మా సంస్థ తరపున స్క్రూటినికి ఎంపికైన బాలల నాటిక 'బాధ్యత', యువ సందేశంతో రూపొందిన 'ఇంకెన్నాళ్లు' నాటకం తప్పకుండా నంది అవార్డులు దక్కించుకుంటాయని గట్టిగా నమ్ముతున్నా. ఎందుకంటే ఈ నాటకాల్లోని సందేశం ఇప్పటికే ఎంతో మందిని కదిలించాయి. భవిష్యత్తులో అనంత నాటకాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించాలన్నదే మా ధ్యేయం.

– ఆముదాల సుబ్రహ్మణ్యం, రచయిత, దర్శకుడు

29న కంబదూరులో 'జగనన్నకు చెబుదాం'

కంబదూరు: ఈ నెల 29న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ సుధాకర్ రాజు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ గౌతమితో పాటు జిల్లా స్థాయి అధికారులూ హాజరు కానున్నారు. సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం పొందే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎంపీడీఓ పిలుపునిచ్చారు.

'అనంత'కు మరో ఎంపీడీఓ

- పోస్టింగ్ కోసం మొత్తం ముగ్గురు ఎంపీడీఓల ఎదురుచూపు

అనంతపురం సిటీ: అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు మరో ఎంపీడీఓ బదిలీ అయ్యారు. దీంతో పోస్టింగ్ కోసం ఎదురు చూసే ఎంపీడీఓల సంఖ్య మూడుకు చేరుకుంది. గతంలో నార్పల ఈఓఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా అన్నమయ్య జిల్లాకు వెళ్లిన లక్ష్మీనరిసింహాను తిరిగి అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు 20 రోజుల కిందట కర్నూలు జిల్లా నుంచి వచ్చిన శ్రీకాంత్ చౌదరి, వైఎస్సార్ కడప జిల్లా నుంచి వచ్చిన రఘునాథ్ పోస్టింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారు. వీరు ముగ్గురూ బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను, ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌ను వేర్వేరుగా కలిసి, తమ పోస్టింగ్ విషయం మాట్లాడారు. తమకు కేటాయించిన మండలాల్లో జాయిన్ అయ్యేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను సీఈఓకు వివరించి, ప్రత్యామ్నాయం చూపాలని కోరారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- బైక్ ర్యాలీ ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం అనంతపురంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని గిరిజమ్మతో పాటు నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, జిల్లా టూరిజం శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులో భాగంగా ఉమ్మడి జిల్లా పర్యాటక ప్రాంతాల సందర్శనతో పాటు ఆయా ప్రాంతాల విశిష్టతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ రూరల్ టూరిజం అవార్డు ఈ సారి లేపాక్షికి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు శాఖల సిబ్బంది, విద్యార్థులు నగర వీధుల్లో పర్యాటక ప్రత్యేకతల ప్లకార్డులను ప్రదర్శిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు.

దారి కోసం దాయాదుల పోరు

- వేటకొడవళ్లతో పరస్పర దాడి

పామిడి: పొలానికి వెళ్లే దారి విషయంగా దాయాదులు గొడవపడి వేటకొడవళ్లతో పరస్పర దాడులు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన చాకలి చెన్నప్ప, చాకలి నరసింహులు, చాకలి లింగన్న, చాకలి జయన్న, చాకలి గోపాల్ అన్నదమ్ములు. వీరిలో చెన్నప్ప, నరసింహులు చనిపోయారు. నరసింహులు భార్య మంగమ్మ, కుమారులు వన్నూరుస్వామి, మహేష్, సునీల్‌తో కలసి వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలోనే లింగన్న పొలానికి అనుకుని ఉన్న శివాయి భూమిని మంగమ్మ కుటుంబం కొనుగోలు చేసి, పంటల సాగు చేపట్టింది. దీంతో మా భూమిలోకి లింగన్న పొలం మీదుగా మంగమ్మ కుటుంబసభ్యులు రాకపోకలు సాగిస్తూ వచ్చారు. అయితే తమ పొలం మీదుగా రాకపోకలకు లింగన్న, గోపాల్ కుటుంబసభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో దారి విషయంగా వివాదం చోటు చేసుకోవడంతో ఇరు కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఇటీవల దారి విషయంగా తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి విచారణ చేపట్టారు. బుధవారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని వేటకొడవళ్లతో పరస్పర దాడులకు దిగారు. ఘటనలో మంగమ్మ కుమారుడు వన్నూరు స్వామి ముఖానికి, నుదురుకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పర్యాటక శాఖాధికారికి అవార్డు



నాగేశ్వరరెడ్డి

అనంతపురం కల్చరల్: జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారి అవార్డు దక్కింది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యాటక శాఖ అధికారిగా పనిచేస్తున్నారు. ఆరు దశాబ్దాలుగా పర్యాటక శాఖకు జిల్లాలో సొంత కార్యాలయం లేని విషయాన్ని గుర్తించిన ఆయన, చొరవ తీసుకుని ఎంపీ కోటా నిధులతో కార్పొరేట్ తరహాలో నూతన భవనాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం, దేశంలోనే ఉత్తమ టూరిజం విలేజ్‌గా లేపాక్షికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం వెనుక ఆయన పడిన శ్రమకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన అవార్డు అందుకోవాల్సి ఉండగా, జిల్లాలో పర్యాటక వేడుకల నిర్వహణ కారణంగా వెళ్లలేకపోయారు. ఆయన తరపున అవార్డును పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ దీపక్ అందుకోనున్నారు.

సర్వజనాస్పత్రి క్యాజువాలిటీపై నిఘా పెంచాలి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం మెడికల్: నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీపై నిఘా పెంచాలని డిప్యూటీ సూపరింటెండెంట్లను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. 'క్యాజువాలిటీలో కలవరం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన సూపరింటెండెంట్ వివిధ విభాగాల హెచ్ఓడీలు, డిప్యూటీ సూపరింటెండెంట్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు వైద్యులు, పీజీలు ఏ విధంగా సేవలందిస్తున్నారో పర్యవేక్షించాలన్నారు. కేసుల(రోగుల)ను ఎంఎన్ఓలు, ప్రైవేట్ వ్యక్తులు ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయకుండా స్థానికంగా వైద్యమందించేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కిషోర్, డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ శౌరి, డాక్టర్ రామస్వామి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లను తరలించండి

సర్వజనాస్పత్రి పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ అంబులెన్స్‌లు ఉంచకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని టూటౌన్ సీఐకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు లిఖితపూర్వకంగా లేఖ రాశారు. రాత్రి వేళల్లో బ్లూ కోల్ట్స్ పోలీసులు క్యాజువాలిటీ ప్రాంతంలో గస్తీ నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ దుర్మరణం

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు.... ఎన్‌పీ కుంట మండలం యాదలవాండ్లపల్లికి చెందిన తిమ్మమ్మ (46), నరసింహులు దంపతులు బుధవారం ఉదయం విద్యుత్ సామగ్రి కొనుగోలుకు కొక్కంటి క్రాస్‌కు వచ్చారు. సామగ్రి కొనుగోలు చేసుకున్న అనంతరం ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఉస్తినిపల్లి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే వెనుక వస్తున్న ఐచర్ వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని నరసింహులు పక్కకు తిప్పాడు. దీంతో బైక్ అదుపుతప్పి వెనుక కూర్చొన్న తిమ్మమ్మ రోడ్డుపై పడింది. ఆ వెనకనే వస్తున్న ఐచర్ వాహనం చక్రం ఆమె తల మీదుగా దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తమిళనాడులోని నామక్కల్ ప్రాంతానికి చెందిన రఘుపతి (25) పెనుకొండ రూరల్ పరిధిలోని అమ్మవారిపల్లి వద్ద ఉన్న అరుణాచలం ట్రావెల్స్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని గదికి చేరుకున్నాడు. బుధవారం ఉదయం డ్రైవర్ వెళ్లి తలుపు తట్టినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి తొంగి చూశాడు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న రఘుపతి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ రమేష్ బాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, రఘుపతి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: కుమారుడి మృతితో తీవ్ర మనస్తాపం చెందిన ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురంలోని మారుతీనగర్ నగర్‌కు చెందిన రామచంద్ర (67) కుమారుడు బాలసుబ్రహ్మణ్యం కువైట్‌లో పనిచేస్తూ రెండు నెలల క్రితం అక్కడే ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడిపై బెంగతో రామచంద్ర ఇంటి పట్టున ఉండకుండా వీధుల్లో తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనోవేదనకు లోనైన ఆయన బుధవారం గుడ్డం రంగనాథస్వామి ఆలయం సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచరం అందుకున్న రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ అక్కడ చేరుకుని పరిశీలించారు. రామచంద్ర భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాల దొంగలు

అనంతపురం క్రైం: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న యువకులను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా, పట్టుబడిన వారిలో మైనర్లు ఉండడంతో వారిని బాలల పరివర్తన కేంద్రానికి పంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కణేకల్లు చెరువును పరిశీలించిన కలెక్టర్



చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

కణేకల్లు: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు మినీ రిజర్వాయర్‌గా ఉన్న కణేకల్లు చెరువును కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, హెచ్చెల్సీ ఈఈ ఎంవీ రమణారెడ్డి, కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి ఉన్నారు. హెచ్చెల్సీ సిస్టమ్‌పై ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన డయాగ్రామ్‌ను గమనించారు. తుంగభద్ర డ్యామ్ నుంచి హెచ్చెల్సీ చివరి వరకూ కాలువ ఏఏ ప్రాంతాల మీదుగా వెళుతుందో ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఈఈ వివరించారు. 0.4 టీఎంసీల సామర్థ్యమున్న ఈ చెరువు అంతర్గత విస్తీర్ణం 2,108 ఎకరాలు కాగా, చెరువు కింద 2 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. అవుట్ ఫ్లో రెగ్యులేటర్లు అధ్వాన్నంగా ఉండడంతో పాటు బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరుకోవడాన్ని గమనించిన కలెక్టర్.. వాటి పునఃనిర్మాణానికి చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. అవుట్ ఫ్లో రెగ్యులేటర్, స్ట్రక్చర్ (బ్రిడ్జి) నిర్మాణానికి రూ.3.15 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, హెచ్చెల్సీ జేఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' పకడ్బందీగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం విజయవాడ నుంచి ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ గౌతమితో పాటు డీఐఓ యుగంధర్, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) ప్రకారం అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, డాక్టర్ అలాట్మెంట్ కౌంటర్, కన్సల్టేషన్ రూమ్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, కంటి విభాగాల కోసం స్క్రీనింగ్, ట్రీట్మెంట్ కౌంటర్, రెఫరల్ కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్‌మెంటు కోసం సచివాలయ సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. మహిళా పోలీసుల సేవలు కూడా వినియోగించుకోవాలన్నారు. క్యాంపులో పాల్గొనే వైద్యాధికారులను తప్పక మ్యాపింగ్ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక ఓపీని ఏర్పాటు చేయాలన్నారు.

జీజీహెచ్ క్యాజువాలిటీలో ఐసీయూ సేవలు



ఐసీయూలో ఏర్పాటు చేసిన పడకలను పరిశీలిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని క్యాజువాలిటీలో ఐసీయూ సేవలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగానికి వచ్చే క్లిష్టమైన కేసులను ఐసీయూలో ఉంచి చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. అవసరానికనుగుణంగా వెంటిలేటర్, ఇతర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ప్రస్తుతానికి రెండు పడకలను ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో మరో మూడు పడకలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం రేడియాలజీ విభాగంలో డిజిటల్ రేడియోగ్రఫీ సిస్టమ్(డీఆర్)ను ప్రారంభించారు. విజయవాడకు చెందిన రేడియాలజిస్టు డాక్టర్ కులదీప్ రూ.13 లక్షలు విలువ చేసే డీఆర్ సిస్టమ్‌ను జీజీహెచ్‌కు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు అందుకున్న బాషా

అనంతపురం కల్చరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డును 'సాక్షి' ఫొటో జర్నలిస్టు డి.మహబూబ్‌బాషా బుధవారం అందుకున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ సౌజన్యంతో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఇటీవల ఉత్తమ ఫొటోగ్రాఫర్ల జాబితాను ప్రకటించింది. ఇందులో డి.మహబూబ్‌బాషాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపిక చేయడంతో బుధవారం విజయవాడ వేదికగా సాగిన పర్యాటక దినోత్సవంలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ బాషా చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. పురస్కారంతో పాటు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేస్తూ మహబూబ్‌బాషాను నిర్వాహకులు సత్కరించారు.



ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకుంటున్న మహబూబ్‌బాషా

రూ.2.58 కోట్లతో అభివృద్ధి పనులు

- స్టాండింగ్ కమిటీలో ఆమోదం
- పనులు త్వరితగతిన చేపట్టాలి: మేయర్ ఆదేశం



మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో రూ.2.58 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. నగరపాలక సంస్థలో బుధవారం మేయర్ వసీం అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. మొదట నగరపాలక సంస్థ సిబ్బంది అజెండాలోని 26 అంశాలను చదివి వినిపించారు. అనంతరం కమిటీ సభ్యులు అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కమిషనర్ భాగ్యలక్ష్మి, తదితరులను ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీ సమస్యలు అధికంగా వస్తున్నాయని, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. నగర ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కొన్ని సచివాలయాల్లో డివైజ్‌లు పని చేయడం లేదన్న ఫిర్యాదులు అందాయని, పరిష్కరించాలన్నారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతి డివిజన్‌లో శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని డివిజన్లలో చిరునామాలు తెలిపే బోర్డులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు శేఖర్‌బాబు, అబూసలేహ, సంపంగి రామాంజినేయులు, లీలావతి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలు ఇవే..

25వ డివిజన్‌లో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు, 11వ డివిజన్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.11.50 లక్షలతో మరో సీసీ రోడ్డు, 37వ డివిజన్‌లో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.30 లక్షలతో మరో సీసీ రోడ్డు, 45వ డివిజన్‌లో రూ.12.50 లక్షలతో ట్యాంకుకు ప్రహరీగోడ, వాచ్‌మెన్ రూం, 2వ డివిజన్‌లో రూ.21.85 లక్షలతో సీసీ రోడ్డు, ఇందిరా గాంధీనగర్‌లో రూ.11.80 లక్షలతో సీసీ రోడ్డు, కాలువ, 22వ డివిజన్‌లో రూ.22 లక్షలతో సీసీ డ్రైన్, 9వ డివిజన్‌లో రూ.20 లక్షలతో 4.95 ఎక్సెస్‌తో సీసీ డ్రైన్, 3వ డివిజన్‌లో రూ.49 లక్షలతో పాటు 4.59 ఎక్సెస్‌తో ప్రహరీగోడ, 4వ డివిజన్‌లో 4.59 ఎక్సెస్‌తో రూ.28 లక్షల సీసీ రోడ్డు, 25వ డివిజన్‌లో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, 50వ డివిజన్ హెచ్‌ఎల్‌సీ కాలనీలో రూ.15.70 లక్షలతో ఉమెన్స్ పార్క్‌లో అభివృద్ధి పనులు తదితర అంశాలకు ఆమోదం తెలిపారు.

10 పే అండ్ యూజ్ టాయిలెట్స్..

నగర జనాభాకు అనుగుణంగా 10 పే అండ్ యూజ్ టాయిలెట్ల నిర్వహణకు కాంట్రాక్ట్ ఇచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. నగరంలోని కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాల, పైడి లక్ష్మయ్య రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, సంగమేష్ సర్కిల్, గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్, పెన్నార్ భవన్, పీటీసీ, పాతఊరు పూల మార్కెట్, విద్యుత్‌నగర్ సర్కిల్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదురుగా పే అండ్ యూజ్ టాయిలెట్ల ఏర్పాటుకు సంబంధించి ఏలూరుకు చెందిన సర్వోదయ సంస్థాన్ బీటీటీ పద్ధతిలో నిర్వహించడానికి ఐదేళ్ల కాంట్రాక్ట్‌ను అందిస్తూ ఆమోదం తెలిపారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత సేవలు

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం విస్తృత సేవలు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్న పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం రాప్తాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ల సమావేశాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: విద్యార్థులకు సంబంధించి పాఠశాలల్లో ఏ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. నీటి సమస్య ఉందని పరిష్కరించాలని కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లీమారోజ్ ఎంపీపీని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. సచివాలయ కన్వీనర్లు ఓబీ టైలర్ వెంకటేష్, వెంకట్‌రామిరెడ్డి, వన్నూరప్ప తదితరులున్నారు.

ఆస్పత్రికి 'అమ్మ' చేయూత



స్ట్రెచర్లను అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రోగులకు అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూతనిచ్చింది. అసోసియేషన్ నిర్వాహకులు బుధవారం రూ.33 వేలు విలువ చేసే స్ట్రెచర్లను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావుకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు అసోసియేషన్ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ బీమసేనాచార్, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ఎంపిక



ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న వలంటీర్లు

అనంతపురం: న్యూ ఢిల్లీలో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఎంపిక ప్రక్రియను జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఎత్తు, పరుగు పందెం, కవాతు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చాటిన ప్రతిభ ఆధారంగా జేఎన్‌టీయూ అనంతపురం నుంచి ఇద్దరు బాలికలను ఎంపిక చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల నుంచి 150 మంది వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి. సుమలత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శారద తదితరులు అభినందించారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని కొనసాగించాలి




అంబేడ్కర్ విగ్రహానికి వినతపత్రం ఇస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని కొనసాగించాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల తీరుకు నిరసనగా బుధవారం ఆందోళనలు నిర్వహించారు. క్యాంపస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. విద్యార్థులు లేరని విభాగాలను మూసివేస్తే, వర్సిటీలో పది విభాగాలను మూసివేయాల్సి వస్తుందన్నారు. ఇలా చేయడం న్యాయం కాదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ నాయకులు వేమన, డాక్టర్ అంకన్న, టీచింగ్ అసిస్టెంట్‌లు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు
- ఇన్‌చార్జ్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి



అనంతపురం క్రైం: అనంతపురం జిల్లా కేంద్రంలోకి వచ్చే ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. 18 సంవత్సరాలలోపు వయసు వారు వాహనాలు నడపరాదన్నారు. చాలా మంది విద్యార్థులు కళాశాలలకు ద్విచక్ర వాహనాల్లో వస్తున్నారని, ఆయా కళాశాలల వద్ద తప్పకుండా వాహనాల తనిఖీ చేపడతామన్నారు. మైనర్లు వాహనాలు నడిపినా వాహనాల యాజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శబ్దం వచ్చే సైలెన్సర్‌ను వాహనాలకు అమర్చకూడదని సూచించారు. పార్కింగ్ లేని ప్రదేశాలలో వాహనాలు నిలపరాదన్నారు. వ్యాపార సముదాయాల దగ్గర సెల్లార్లలో మాత్రమే వాహనాలు పార్క్ చేయాలన్నారు. నగరంలో ప్రధాన ప్రాంతాలైన సాయి నగర్, కమలానగర్, ఓల్డ్ టౌన్ గాంధీ బజార్, తిలక్ రోడ్డు, రామచంద్ర నగర్, సుభాష్ రోడ్డు, అరవింద్ నగర్, అశోక్ నగర్, కోర్టు రోడ్డు, గుల్జార్ పేట, బళ్లారి బైపాస్‌లోని టిఫెన్ సెంటర్ల వద్ద 1, 6వ రోడ్డులలో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రధాన రోడ్డులో ఒక వైపు మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణాలు చేయకూడదన్నారు. ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డుకు ఎడమ వైపు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. వాహనదారులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. పాదచారులు, జంతువులు రోడ్డు దాటుతున్నపుడు వాహనదారులు నిదానంగా వెళ్లాలని కోరారు. సీఐ వెంకటేశ్‌నాయక్ ఉన్నారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 29, 38వ డివిజన్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, డీఈ ప్రసన్నలక్ష్మి, నాయకులు ఖాజా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

రాప్తాడురూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అనంతపురం నగర మేయర్ వసీం తెలిపారు. అనంతపురం నగరంలోని భాష్యం స్కూల్‌లో బుధవారం 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం చేపట్టారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్ కమల్ భూషణ్, షేక్ ఖాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని శ్రమదానంతో శుభ్రపరిచారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. పాఠశాల జెడ్‌ఈఓ రవివర్మ, రాయలసీమ జోన్ సీఈఓ అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

అనంతపురం కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం రెవెన్యూ కాలనీలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. ప్రధానంగా యువత ముందుకు రావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మొక్కల ప్రాముఖ్యతను తెలియజేసి, చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లాలూ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమక్షంలో విచారణ జరపాలి



విచారణాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై కార్మికుల సమక్షంలో విచారణ జరపాలని విచారణాధికారి కేశవనాయుడును సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు కోరారు. బుధవారం ఆన్‌సెట్ అధికారి (విచారణాధికారి) కేశవనాయుడును కలసి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఓబులు మాట్లాడుతూ మడకశిర డివిజన్ పరిధిలోని కాంట్రాక్టర్ కార్మికులకు అందించాల్సిన వేతనాల్లో రూ.2,500 కోత విధించడంతో పాటు బినామీ పేర్లతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. కాంట్రాక్టర్‌పై విచారణ జరపాలని కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేశారన్నారు. విచారణ కార్మికుల సమక్షంలో జరిగితేనే కాంట్రాక్టర్ అవినీతి అక్రమాలు బయటకు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సాయం చేస్తున్న యువతి



దాహం తీరుస్తూ..

అవ్వకు 'ఆపన్నహస్తం'

ఆ అవ్వకు ఎవరూ లేరు. కోర్టు రోడ్డు నుంచి పెద్దాస్పత్రికి వెళ్లే మార్గంలో నిత్యం యాచనతో బతుకీడుస్తోంది. పెద్ద మనసు తలచి పలువురు దయతలిస్తే కడుపు నింపుకుంటుంది. బుధవారం అటు వైపు బైకులో వెళ్లిన ఓ యువతిని ఆ అవ్వ సాయం చేయమని చేయి చాపింది. వృద్ధురాలి పరిస్థితి చూసి చలించిన సదరు యువతి బైకు ఆపి ఆపన్నహస్తం అందించింది. అంతటితో ఆగక స్వయంగా ఆమెకు బాటిల్‌లో నీరు అందించి దప్పిక తీర్చింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆసక్తి కలిగించింది. యువతి సాయం చేసిన చిత్రాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్రగతిలో పర్యాటక రంగం కీలకం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి

రాప్తాడురూరల్: దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతిలో పర్యాటక రంగం కీలకపాత్ర పోషిస్తుందని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌళి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్ట్స్ కళాశాల చరిత్ర, వాణిజ్య శాస్త్రం, రాజనీతిశాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకురావడంలో పర్యాటక రంగం చాలా కృషి చేస్తుందన్నారు. భారతదేశం ఘనమైన వారసత్వ సంపదను కలిగి ఉందన్నారు. దేశంలోని ప్రతిప్రాంతం ఎంతో చరిత్ర కలిగి ఉందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి మనదేశంలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతపురం నగరంలోనూ అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వీటిని సందర్శించడం ద్వారా విజ్ఞానంతో పాటు మానసిక ఆనందం లభిస్తుందన్నారు. వాణిజ్య, చరిత్ర విభాగాధిపతులు అనంతరెడ్డి, శ్రీరాములునాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని దేశాలూ పర్యాటక రంగం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకుడు కరణం సుధాకర్, రాజనీతిశాస్త్రం అధ్యాపకులు సంగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు భగత్‌సింగ్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: రాజీలేని స్వాతంత్య్ర పోరాటయోధుడు భగత్ సింగ్ అని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) రాష్ట్ర కార్యదర్శి మహేష్, రాఘవేంద్ర పేర్కొన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతిని పురస్కరించుకుని ఏఐడీఎస్‌ఓ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం నగరంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్, రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అమరవీరుడు భగత్ సింగ్ అన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా నిలుస్తూ భగత్ సింగ్ కలలుగన్న సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ నగర అధ్యక్షులు బి. సురేష్, నగర కార్యదర్శి ఎం. చరణ్, నగర ఉపాధ్యక్షులు చరణ్ దీప్, మహేష్ బాబు, మహమ్మద్, చరణ్ తేజ్, నవ్య, చంద్రిమ, కవిత, షామీర్, మహేష్, లోహిత్, అజ్మత్, వాజిద్ విద్యార్థులు పాల్గొన్నారు.

- భారత స్వాతంత్య్ర పోరాట వీరుడు భగత్ సింగ్ 116వ జయంతిని పురస్కరించుకుని ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో వర్సిటీలో కార్యక్రమాలు నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. మానవ హక్కుల వేదిక సభ్యులు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ జాతీయ సభ్యులు వేమన, రాజు నాయక్ పాల్గొన్నారు.

'మిలాదున్నబీ'కి మసీదుల ముస్తాబు



ముస్తాబైన మసీదు

అనంతపురం కల్చరల్: మిలాదున్నబీ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలంకరణలతో రెండో రోడ్డులోని బహావుద్దీన్ మసీదుతో పాటు మజ్జిదే మొహియుద్దీన్ అష్రఫియా తదితర మసీదులు కొత్త శోభ సంతరించుకున్నాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా సామూహిక ప్రార్థనలు ఘనంగా జరుగనున్నాయి. ముఖ్యంగా 'జులుసే మహ్మదీయా' పేరిట ఉదయం శాంతి ర్యాలీలు జరగనున్నాయి. స్థానిక సప్తగిరి సర్కిల్ కూడలిలోని ఈద్గా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. మహ్మద్ ప్రవక్త భూమిపైకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని దేవదూతలు సంతోషంతో జులుస్ (ర్యాలీ) నిర్వహించారని హదీసు పేర్కొంటోంది. దానికి సంకేతంగా జరిగే శాంతిర్యాలీలో అందరూ పాల్గొనాలని పలు మసీదుల పేష్ ఇమామ్‌లు, ముతవల్లీలు పిలుపునిచ్చారు.

కేశ దర్శనానికి ఏర్పాట్లు

మహ్మద్ ప్రవక్త (స) కేశ దర్శనాన్ని మిలాదున్నబీ పర్వదిన విశేషంగా భావిస్తారు. పాతూరు ఆసార్ వీధిలోని ఆసార్ దర్గా, శాంతినగర్‌లోని చిస్తియా మసీదు, రెండో రోడ్డులోని బహావుద్దీన్ మసీదుల్లో సాయంత్రం 4 గంటల నుంచి ప్రవక్త పవిత్ర కేశ దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రార్థనల్లో పాల్గొనే వారికి ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేసినట్లు మసీదు పేష్ ఇమామ్ యూనిస్‌ఖాన్ తెలిపారు.

మిలాదున్నబీ శుభాకాంక్షలు

అనంతపురం కార్పొరేషన్: మైనార్టీలకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ మిలాదున్నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం అల్లాహ్ ప్రపంచ శాంతి కోరుతూ చివరి ప్రవక్తగా మహ్మద్ ఎంపిక య్యాడన్నారు. ముస్లింలందరూ అత్యంత పవిత్ర గ్రంథంగా భావించే ఖురాన్‌లో మహమ్మద్ ప్రవక్త గురించి పేర్కొన్నారన్నారు. ప్రవక్త మహ్మద్‌ను విశ్వ శాంతి కోసం అల్లాహ్ నియమించారన్నారు. అందుకే జన్మించిన రోజున స్మరించుకుంటూ పండుగ జరుపుకుంటారని తెలిపారు.

సోదరభావంతో మెలగాలి

బుక్కరాయసముద్రం: ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని బీకేఎస్ సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భారతదేశం వివిధ మతాలు, జాతులు, సంప్రదాయాలకు నిలయమన్నారు. పురాతన దేవాలయాలు, మసీదులు, చర్చిలు దర్గాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచుతామన్నారు. ఆలయాలు కమిటీ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, బీకేఎస్ దర్గా కమిటీ చైర్మన్ నాగభూషణ (బూసీ), కాశీ విశ్వేశ్వర దేవాలయ చైర్మన్ వెంకట చలపతి, ఇర్ఫాన్ ఇస్లాంపూర్ కాలనీ సుల్తాన్ చాంద్ బాషా, రజాక్, వినాయక గుడి మేనేజర్ శాంతి మూర్తి, సాయి బాబ గుడి పూజారి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

30న హుండీ కానుకల లెక్కింపు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు కొండమీద వెంకట రమణ స్వామి హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



నరసంపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే తరతమ బేధాలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ కుంపట్టి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు. మండలంలోని నరసంపల్లిలో బుధవారం మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేశారు. నరసంపల్లిలో సచివాలయ భవన నిర్మాణం, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించటంతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలను కూడా మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, హౌసింగ్ ఏఈ చిరంజీవి, ఏపీఓ వెంకటేష్‌నాయక్, స్థానిక ఎంపీటీసీ దాదాఖలంధర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలి

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం గుర్తించిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని రైతు సంఘం నాయకులు బుధవారం ఎల్‌డీఎం సత్యరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. సీసీఆర్‌సీ కార్డులు చూపించినా రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రావడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,600 మందికి సీసీఆర్‌సీలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, నాయకులు రామాంజినేయులు, పుష్పరాజ్, నాగేంద్ర, గోపాల్, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా వేలంపాట

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బుధవారం కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు వేలంపాట సజావుగా సాగింది. 42వ షాపును (గ్రౌండ్ ఫ్లోర్) పాటదారుడు దక్కించుకున్నారు. మిగిలిన 36, 51 షాపుల లీజుకు వచ్చే నెల 4న ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.

గంధం మహోత్సవంలో మేయర్

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరులో ఉన్న బోయ వీధిలో బుధవారం షరీఫ్ సాబ్ కుటుంబ సభ్యులు జిలాన్ ఇంటి నుంచి నిర్వహించిన గంధం మహోత్సవంలో మేయర్ మొహమ్మద్ వసీం సలీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు మతసామరస్యాన్ని చాటుతాయన్నారు. కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్‌లు కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్, రబ్బానీ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం అర్బన్: జీపీఎస్ బిల్లును ఉపసంహరించి ఓపీఎస్‌ను ప్రభుత్వం పునరుద్ధరించాలంటూ ఎస్టీయూ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జీపీఎస్ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యుడు, రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రామాంజినేయులు, రవి, రాజశేఖర్, వాణి, కిషోర్, ఫణిభూషణ, కృష్ణమోహన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి

అనంతపురం కల్చరల్: జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్ట్స్ కాలేజ్ మెయిన్ గేట్ ఎదురుగా ఏర్పాటు చేసిన జాషువా విగ్రహం వద్ద జరిగే వేడుకల్లో సాహిత్య అభిమానులందరూ పాల్గొనాలని కోరారు.